సాక్షి నిజామాబాద్

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు.

- 8లో ▸



రెన్యువల్‌లో తిరకాసు

వృద్ధులకు సంబంధించిన పంట రుణాలను రెన్యువల్ చేయడానికి బ్యాంకర్లు ఆసక్తి చూపడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /23.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో 11,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 522 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతోంది. వర్షాలు పడుతుండటంతో లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 (80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1081.80 (50 టీఎంసీలు) నీరు ఉంది.

నిజాంసాగర్‌లోకి 1,500 క్యూసెక్కులు..

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)కుగాను సోమవారం సాయంత్రానికి 1,390.50 అడుగుల(4.251 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఎంపీ



సుభాష్‌నగర్: తిరుపతిలోని వేంకటేశ్వర స్వామిని ఎంపీ అర్వింద్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి దంపతులు తదితరులు ఉన్నారు.

ఆరో రోజుకు చేరిన జూడాల నిరసన



నిజామాబాద్ నాగారం: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళన సోమవారం ఆరో రోజూ కొనసాగింది. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్లకు వసతులు కల్పించాలన్నారు.

పేకాటస్థావరంపై దాడి.. భారీగా నగదు స్వాధీనం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో సోమవారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 35 మంది నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, పెద్ద మొత్తంలో నగదు, సెల్‌ఫోన్స్, కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌గల్ సీఐ నవీన్, ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామంలోని బాంకెట్ హాల్‌లో పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి రాత్రి 7 గంటల సమయంలో తన సిబ్బందితో వెళ్లి మెరుపు దాడి చేశారు. 35 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2.38 లక్షలు, 228 కాయిన్స్, 35 సెల్‌ఫోన్‌లు, నాలుగు కార్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారు మెట్‌పల్లి, మంచిర్యాల, బాన్సువాడ, బోధన్ తదితర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని నిర్వాహకులపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



నగరంలోని బోధన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



రైల్వేస్టేషన్ వద్ద వరద నీటిలో వాహనదారుల ఇబ్బందులు



రైల్వేస్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

3 గంటలు.. ముంచెత్తిన వాన

జిల్లాలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. మూడు గంటల వ్యవధిలోనే 8.3 సెంటీమీటర్ల వర్షం పడటంతో ప్రజలు అతలాకుతలం అయ్యారు. నిజామాబాద్ నగరంలో సైతం భారీ వాన పడింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద నీటిలో బస్సు చిక్కుకుంది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాల్లో నీరు చేరింది.

- నగరంలోని రైల్వే కమాన్ వద్ద వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- ప్రయాణికులను సురక్షితంగా కాపాడిన పోలీసులు, మున్సిపల్ సిబ్బంది
- జలమయమైన రహదారులు
- భీమ్‌గల్‌లో అత్యధికంగా 10 సెం.మీ.

జిల్లా వ్యాప్తంగా 8.3 సెంటీమీటర్ల వర్షపాతం



నగరంలోని రైల్వే కమాన్ కింద చిక్కుకున్న బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు తీసుకొస్తున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది



ప్రయాణికులను బయటకు తీసుకు వస్తున్న మున్సిపల్ సిబ్బంది, పోలీసులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వాన దంచికొట్టింది. కుండపోతగా వర్షం కురవడంతో రహదారులు జలమయం అయ్యాయి. నిజామాబాద్ నగరంలో ఏకధాటిగా గంటపాటు కురిసిన వర్షంతో కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం కురిసింది. మూడు గంటల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గంటలోనే రెండు సెంటీమీటర్ల వర్షం పడింది. క్యూములోనింబస్ మేఘాలతో ఈ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారి పేర్కొన్నారు.



ఎడపల్లి మండలంలోని బాపునగర్ శివారులో నీట మునిగిన వరి

లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు

జిల్లాలో నాలుగు గంటల పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు ఉప్పొంగిపోయాయి. నిజామాబాద్ నగరంలో ప్రధాన చౌరస్తాలతో పాటు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టారు.

ప్రయాణికులను సురక్షితంగా తరలించాం

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే కమాన్ కింద చిక్కుకున్న బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా తరలించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా అందులో 10 మంది వరకు పిల్లలు ఉన్నారని చెప్పారు. ట్రాఫిక్ సీఐ నరహరి, కానిస్టేబుల్ స్వప్నతో కలిసి ప్రయాణికులను కాపాడామన్నారు. ట్రాఫిక్ పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వరద నీటిలో బస్సు.. ప్రయాణికుల ఆందోళన

వర్షంతో నగరంలో రైల్వే కమాన్ వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వచ్చే వాహనాలను అధికారులు నిలిపివేశారు. అప్పటికే ఓ ఆర్టీసీ బస్సు బస్టాండ్ వైపు వెళ్లేందుకు రాగా వరద నీటిలో చిక్కుకుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న మున్సిపాలిటీ, పోలీస్ అధికారులు గంట పాటు శ్రమించి అందులోని ప్రయాణికులను బయటకు తీసుకు వచ్చారు. అనంతరం బస్సును జేసీబీ సాయంతో బయటకు తీశారు.



మున్సిపల్ కమిషనర్ మకరందు, పోలీసులు అక్కడే ఉండి వర్షపు నీటిని పూర్తిగా తొలగింపజేశారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు	
ప్రాంతం	వర్షపాతం (సెం.మీ.లలో)
భీమ్‌గల్	10
నిజామాబాద్ సౌత్	8.1
నిజామాబాద్ నార్త్	7.2
కమ్మర్‌పల్లి	6.1
గూపన్‌పల్లి	6.1
మెండోరా	4.2
బెల్లాల్	4.5
ఎడపల్లి	4.1
జాన్కంపేట	3.8
సీహెచ్ కొండూరు	3.1
గన్నారం	3.1
బాల్కొండ	2
తొండకూరు	1.01



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరందు, పోలీసులు



ముప్కాల్ కేజీబీవీలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థినులు

జిల్లాలో సోమవారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నాదమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టారు. సోదరులు కట్నకానుకలు అందించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చూడాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, రుణమాఫీ జరగని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో సమీక్ష జరిపారు. పంట రుణాలమాఫీ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై దిశానిర్దేశం చేశారు. రుణమాఫీకి సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు. రుణమాఫీ విషయమై సంప్రదించే రైతుల పట్ల సానుకూల ధోరణితో వ్యవహరించాలని, ఎక్కడ కూడా అధికారులు స్పందించడం లేదని తమకు ఫిర్యాదులు రావొద్దన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ ఓటరు జాబితా ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. రాష్ట్ర స్థాయి అధికారుల బృందం సైతం పరిశీలన కోసం వస్తుందని, సర్వేకు సంబంధించిన అన్ని వివరాలను సక్రమంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలన్నారు. ఓటరు జాబితా సవరణ అంశాలపై ప్రతి బుధవారం ఈఆర్‌వోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై చర్చించాలని సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

పంటల ధ్వంసంతో ఉద్రిక్తత

- అటవీ భూమిలో సాగు చేసిన పంటలు తొలగించిన అధికారులు
- ఎదురు తిరిగిన జంగిలోడి తండా వాసులు
- సిరికొండ ఎఫ్ఆర్వోకు రూ. 5 లక్షలు ఇచ్చామని ఆరోపణ

సిరికొండ: సిరికొండ రేంజ్ పరిధి రావుట్ల బీట్ అటవీ ప్రాంతంలో సాగు చేస్తున్న పంటలను ధ్వంసం చేసిన అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనులు ఎదురు దాడి చేశారు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకోగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జంగిలోడి తండాకు చెందిన గిరిజనులు ఈ పంటలను సాగు చేస్తున్నారు. సమాచారం మేరకు సిరికొండ, కమ్మర్‌పల్లి ఎఫ్ఆర్వోలు ఎంవీ నాయక్, రవీందర్‌లు తమ సిబ్బందితో ధర్పల్లి, డిచ్‌పల్లి సీఐలు భిక్షపతి, మల్లేష్‌లు సిరికొండ, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి ఎస్సైలు వందలాది మంది పోలీసులతో జంగిలోడి తండా అటవీ శివారుకు చేరుకున్నారు. వరి, పత్తి పంటలను జేసీబీతో ధ్వంసం చేయించారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. మహిళల రాళ్లతో దాడిలో జేసీబీ అద్దాలు ధ్వంసమయ్యాయి. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, ఇన్‌చార్జి డీఎఫ్‌వో నిఖిత అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పనులను అడ్డుకున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అటవీ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. కాగా పంటలను సాగు చేసుకోవడానికి సిరికొండ ఎఫ్ఆర్వో ఎంవీ నాయక్‌కు రూ. ఐదు లక్షలు ఇచ్చామని గిరిజనులు ఆరోపించారు.



పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న గిరిజనులు



పత్తి మొక్కలను తొలగిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ విజేత నిజామాబాద్



నిజామాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేసిన జిల్లా జడ్జి సునీత, డాక్టర్ కవితారెడ్డి, ఏఆర్ ఏసీపీ నాగయ్య

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌షిప్‌ను నిజామాబాద్ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కవితారెడ్డి సౌజన్యంతో స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న టోర్నీలో సోమవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు ఖమ్మంపై 3–0 తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. నిజామాబాద్ తరపున అంతర్జాతీయ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య హ్యాట్రిక్ గోల్స్ సాధించింది. రెండో సెమీఫైనల్‌లో మెదక్ జట్టు నల్గొండపై విజయం సాధించి ఫైనల్స్‌కి చేరుకుంది. నిజామాబాద్– మెదక్ మధ్య ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైన ఐదు నిమిషాలకే భారీ వర్షం పడింది. దీంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. మ్యాచ్ రెఫరీ, కమిటీ ఆదేశానుసారం విజేతను తేల్చ డానికి టాస్ వేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లా జట్టుకు విజయం వరించింది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి సునిత కుంచాల మాట్లాడుతూ.. జిల్లాలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయి టోర్నీని జిల్లాలో నిర్వహించిన జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మీర్ ఫారూక్ అలీ, మహమ్మద్ జావిద్‌ను, సహకరించిన డాక్టర్ కవితారెడ్డిని అభినందించారు. అనంతరం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఆర్ ఏసీపీ నాగయ్య, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫాల్గుణ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం వైస్ ప్రెసిడెంట్ ఖలీద్, గిరి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు ఎస్సైల బదిలీ

ఖలీల్‌వాడి: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను నిర్మల్ జిల్లా బోథ్‌కు, ముప్కాల్ ఎస్సైగా ఉన్న భాస్కరాచారిని సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆ తరువాత సీపీ కార్యాలయం నుంచి నిర్మల్ జిల్లా కుంటాల ఎస్సైగా భాస్కరాచారిని బదిలీ చేశారు.

నేడు వాహనాల వేలం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలతోపాటు రెండు ఆటోలను మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ ఆఫీస్ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు రూ.5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఢిల్లీవాలా స్వీట్ హోంపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఢిల్లీవాలా స్వీట్ హోంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వీట్ హోమ్ వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం రోజున గాంధీచౌక్ నుంచి మమత సర్కిల్ వరకు ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులతో స్వీట్‌హోం నిర్వాహకులు గొడవపడ్డారని, ఆ తరువాత పోలీసుల వేధింపుల కారణంగా స్వీట్‌హోంను మూసివేస్తున్నామని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి న్యూసెన్స్ చేసినట్లు తెలిపారు. ఢిల్లీ వాలా స్వీట్ హోంపై బీఎన్‌ఎస్ కింద క్రైం నంబర్ 343/2024, యూ/ఎస్ 221, 224, 285 కింద కేసు నమోదు చేసి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు నివేదిక పంపించినట్లు ప్రకటనలో తెలిపారు. ఢిల్లీవాలా స్వీట్ హోం వారు పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి ని శాఖ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులకు గురి చేయలేదని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


నునావత్ లాల్(ఫైల్)

నవీపేట:మండలంలోని శివ తండాకు చెందిన నునావత్ లాల్ అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. రెండు రోజుల క్రితం భార్యతో గొడవపడి లాల్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. తిరిగి ఇంటికి రాలేదని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుండూర్‌లో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి ఎస్సై భువనేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని రూ.10 వేల 900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాటస్థావరాలు ఎక్కడైనా కొనసాగితే తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

రెన్యువల్‌లో తిరకాసు

- వృద్ధాప్యాన్ని సాకుగా చూపుతూ పంట రుణాలు రెన్యువల్ చేయని వైనం
- 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు రుణాలు ఇవ్వొచ్చని గతంలోనే నిర్ణయం


కొన్ని బ్యాంకుల్లో వృద్ధ రైతులకు పంట రుణాలను

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ముల గంగు అనే మహిళా రైతుకు మూడు ఎకరాల భూమి ఉంది. ఆమెకు రూ.1.80లక్షల రుణం మాఫీ అయ్యింది. కొత్తగా పంట రుణం కోసం తమ గ్రామంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దరఖాస్తు చేసుకుంది. అయితే, ఆమెకు 62 ఏళ్ల వయస్సు ఉన్న కారణంగా పంట రుణం ఇవ్వలేమని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. రుణం మాఫీకాగా తాను బ్యాంకుకు ఎలాంటి బకాయి లేనని కొత్తగా రుణం ఇవ్వడానికి ఎందుకు తిరకాసు పెడుతున్నారని ఆ మహిళా రైతు సదరు బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే వృద్ధాప్యాన్ని సాకుగా చూపుతున్నారు.

ఇది ఒక్క గంగుకు ఎదురైన సమస్య కాదు. పంట రుణం మాఫీకి అర్హత సాధించిన ఎంతో మంది వృద్ధ రైతులు ఎదుర్కొంటున్నది. 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు రైతులకు పంట రుణాలను ఇవ్వొచ్చని గతంలోనే నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని బ్యాంకుల్లో వృద్ధ రైతులకు పంట రుణాలను రెన్యువల్ చేస్తున్నారు. అనేక చోట్ల వృద్ధులైన రైతులకు పంట రుణాలను రెన్యువల్ చేయడం కాని మాఫీ పొందిన వారికి కొత్త రుణం ఇవ్వడం కానీ చేయడం లేదు. వ్యవసాయం చేసే సత్తా ఉన్నా వయస్సును కారణంగా చూపుతూ తమకు రుణం ఇవ్వకపోవడం సరికాదని వృద్ధ రైతులు వాపోతున్నారు. ఆరోగ్యం సహకరించడంతో తాము సొంతంగానే పొలం పనులు చేసుకుంటున్నామని ఇలా రుణాలు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా లీడ్ బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి పంట రుణాల విషయంలో వృద్ధాప్యాన్ని సాకుగా చూపకుండా వెసులుబాటు కల్పించేలా చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రుణం ఇవ్వకపోతే ఎలా..



వ్యవసాయం చేస్తున్న ప్రతి ఒక్క రైతుకూ అవసరం ఉంటే పంట రుణం ఇవ్వాలి.ఆరోగ్యం సహకరిస్తుండడంతో వయస్సు మీద పడినా ఎంతో మంది చక్కగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. కేవలం వృద్ధాప్యాన్ని సాకుగా చూపడం సరికాదు. బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాలి. – కొలిప్యాక ఉపేంద్ర, మాజీ ఎంపీపీ, ఏర్గట్ల

ప్రభుత్వ ఆశయాన్ని దెబ్బతీయొద్దు



పంటరుణం మాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సానుకూలంగా వ్యవహరించింది. ఇప్పుడు పంట రుణం మాఫీ అయిన వృద్ధులకు ఎందుకు కొత్తగా రుణం ఇవ్వకుండా సతాయిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. రైతులను ఇబ్బందులకు గురిచేసి ప్రభుత్వ ఆశయాన్ని దెబ్బతీయడం బ్యాంకర్లకు తగదు.

– కుంట రవిశంకర్, రైతు, పాలెం

దేశం, ధర్మ పరిరక్షణే రక్షాబంధన్ సందేశం


భగవా ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రాపెల్లి రవీందర్

సుభాష్‌నగర్: దేశం, ధర్మ పరిరక్షణ బాధ్యతను మనకి గుర్తుచేసే పండగే రక్షాబంధన్ అని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ కంఠేశ్వర్, నాందేవ్‌వాడ ఉపనగరాల రక్షాబంధన్ కార్యక్రమానికి ఆయన ప్రధానవక్తగా హాజరై మాట్లాడారు. మన సంస్కృతి మీద దాడులు జరిగిన ప్రతిసారి భారతీయులు.. ముఖ్యంగా హిందువులు ధర్మరక్షణ కోసం కంకణ ధారులై దేశాన్ని ధర్మాన్ని కాపాడారని, సంస్కృతిని పరిరక్షించిన వీరుల వారసులే హిందువులనే విషయాన్ని మనం ప్రతిరోజూ గుర్తు చేసుకోవాలన్నారు. హిందూ సమాజంలో అంటరానితనం, కుల బేధాలు క్యాన్సర్ కన్నా ప్రమాదమని, వాటిని ఆచరించేవాళ్లు అసలు మనుషులే కాదన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాపెల్లి రవీందర్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ వంటి ఒక మహోన్నతమైన సంస్థ వేదిక మీదకి తనను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అరుగుల సత్యం, సహ కార్యవాహలు సుమిత్, వెంకటేశ్, జిల్లా, విభాగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి జగదీశ్వరి.

– ఖలీల్‌వాడి

న్యాయవాదులపై దాడులు సరికాదు



జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

ఖలీల్‌వాడి: రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై పోలీసుల భౌతికదాడులు సరికాదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ అన్నారు. జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు సంతోష్‌ను అకారణంగా ఇంటి నుంచి తీసుకువెళ్లిన తీరు సభ్యసమాజానికి తలవంపులు తెచ్చిందన్నారు. పోలీసులు చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడడం క్షమించరాని క్రిమినల్ చర్య అని పేర్కొన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జమాల్‌ను ఉద్యోగం నుంచి తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై పోలీసు దాడులపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం త్వరితగతిన రూపొందించి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కోశాధికారి దీపక్, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, న్యాయవాదులు మాణిక్‌రాజు, రవీందర్, భిక్షపతి, బిట్ల రవి, ఆశ నారాయణ, విశ్వక్ సేన్‌రాజ్, భానుచందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ సమస్యలను పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్


కలెక్టరేట్ ఆవరణలో అశోక ఎన్‌క్లేవ్ ప్లాట్ల యజమానులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 20 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తోపాటు డీఆర్డీవో సాయాగౌడ్, అదనపు ఎస్పీ బస్వారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంచర్‌లో నుంచి రైల్వే లైన్ వేయొద్దు

గూపన్‌పల్లి, పాంగ్రా శివారు బైపాస్ రోడ్డులో అశోక ఎన్‌క్లేవ్ నుంచి రైల్వే శాఖ అదనపు బ్రిడ్జి నిర్మాణం చేపట్టబోతోందని, దీనిని వెంటనే ఆపేయాలని బాధితులు సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. వెంచర్ ప్రారంభించిన సమయంలో ఎలాంటి ప్రతిపాదనలు లేవని, ప్రస్తుతం రైల్వే అధికారులు నూతనంగా మరో బ్రిడ్జి వేసి నూతన రైల్వే ట్రాక్ పనులు చేపట్టబోతున్నట్లు వారు పేర్కొన్నారు. దీంతో వెంచర్‌లో సుమారు 100 ప్లాట్లు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రైల్వే జోన్ ప్రాంతం మరో ప్రాంతంలో ఉండగా ఇక్కడ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు.

భూమి కబ్జా చేశారు

పాంగ్రా శివారులో 397, 392, 396 సర్వేలోని తన భూమిని శశాంక్ ఆసుపత్రి వైద్యుడు శశాంక్ కబ్జా చేశాడని చంద్రశేఖర్ కాలనీకి చెందిన రాంయాదవ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఎలాగైనా తన భూమిని తను ఇప్పించాలని కోరాడు.

తాత్సారమెందుకో?

- జీజీహెచ్‌లో ముగిసిన డైట్ టెండర్
- ఓపెన్ కాని టెండర్లు



నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ టెండర్ల ప్రక్రియ ముగిసినా టెండర్లను ఓపెన్‌చేయడం లేదు. అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని టెండర్లలో పాల్గొన్న వారు అంటున్నారు. ఇన్‌పేషెంట్, డ్యూటీ డాక్టర్స్, థెరపెటిక్ పేషెంట్‌లకు అవసరమైన భోజన వసతి కల్పించేందుకు జూలై 11న డైట్ సప్లై టెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ విడుదల చేశారు. జూలై 12 నుంచి 16వరకు టెండర్లను స్వీకరించిన సంబంధిత అధికారులు గడువు తేదీని మరో నాలుగు రోజులు పొడిగించారు. టెండర్లలో పాల్గొన్న 12 మంది రూ.3లక్షల చొప్పున డీడీ తీసి టెండర్‌ఫారాలకు జత చేశారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత 20వ తేదీన టెండర్లను అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో ఓపెన్ చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో టెండర్లు దాఖలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. తాము రూ.3లక్షల బయట వడ్డీకి తీసుకువచ్చి టెండర్లు వేశామని, ఇప్పటికీ టెండర్లు ఓపెన్ చేయకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీల ప్రక్రియ కారణంగా టెండర్లు ఓపెన్ చేయడం ఆలస్యమైందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జీజీహెచ్‌లో గత 14 సంవత్సరాలుగా ఒకే వ్యక్తి డైట్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నాడని ఈ నెల 12న జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో మహ్మద్ ఇజ్వాన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అధికారులను మచ్చిక చేసుకొని టెండర్ జరగకుండా చూస్తున్నారన్నారు. సదరు వ్యక్తి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, వరంగల్, ఆర్మూర్, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితర ఆస్పత్రుల్లో పదికి పైగా డైట్ టెండర్‌లు చేజిక్కించుకొని అంతా తానై నడిపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే టెండర్లను ఓపెన్ చేసి పారదర్శకంగా కొత్తవారికి కేటాయించాలని కోరారు.

కలెక్టర్ వద్ద ఫైల్ ఉంది

టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించాం. మొత్తం 12మంది టెండర్లలో పాల్గొన్నారు. కలెక్టర్ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు టెండర్ ఓపెన్ చేయడం జరుగుతుంది.

– ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

‘డబుల్’ ఇళ్ల కబ్జాకు యత్నం


ఇళ్లు ఖాళీ చేయాలని సముదాయిస్తున్న పోలీసులు

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కబ్జా చేసేందుకు స్థానికులు సోమవారం యత్నించారు. కొందరు ఇళ్ల తమ ఆధార్ కార్డుల జిరాక్స్‌లు అతికించగా, మరికొందరు కొత్తగా తలుపులు బిగించి తాళం వేశారు. వంద ఇళ్లను నిమిషాల వ్యవధిలోనే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వెంకటేశం, సీఐ జయేశ్‌రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్, ఏఎస్సై రాజు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయాలని సూచించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత కేటాయిస్తామని అధికారులు సముదాయించినా వారు వినలేదు. గతంలో పంపిణీ చేసిన 50 ఇళ్లలో అనర్హులు ఉన్నారని, ఇప్పుడు కూడా తమకు ఇళ్లు ఇస్తారనే నమ్మకం లేక వచ్చామన్నారు. తలుపులు ఏర్పాటు చేయడంతోపాటు మిగతా పనులు తామే పూర్తి చేసుకుంటామని మొండికేశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయిస్తామని భరోసా కల్పించారు. గతంలో తయారు చేసిన జాబితాలో పేర్లు లేనివారు తహసీల్ కార్యాలయంలో పేర్లు ఇవ్వాలని సూచించారు. దీంతో పలువురు కబ్జా చేసిన ఇళ్లను ఖాళీ చేసి తహసీల్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత సమగ్ర సర్వే చేసి అర్హులైన వారికి పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెంటేశం వెల్లడించారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి ఇద్దరి మృతి

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చిత్తరి సావిత్రి (30) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్సై సందీప్ తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా సావిత్రి ఈ నెల 12న రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాజీపూర్ తండాకు చెందిన మహిళ..

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హాజీపూర్ తండాకు చెందిన కాత్రోత్ కేస్లీబాయి(55) సోమవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కడుపునొప్పితో బాధపడిన కేస్లీబాయికి వైద్యులు ఆపరేషన్ చేశారని, ఆమె కోలుకోకపోగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో కుటుంబీకులు, తండావాసులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. కేస్లీబాయి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. కేస్లీబాయి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రైలు పట్టాలు దాటుతూ..



ఖలీల్‌వాడి: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మార్కెట్‌యార్డు పక్కన సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను(87126 58591, 94934 51642) సంప్రదించాలని ఆయన సూచించారు.

ఒకరి బైండోవర్



మాచారెడ్డి: మద్యం సేవించి తరచుగా డయల్ 100కి కాల్‌చేసి సమయాన్ని దుర్వినియోగం చేసిన ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఎరిగె చందు అనే వ్యక్తిని తహసీల్ కార్యాలయంలో సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అవసరం లేకున్నా డయల్ 100కు, 108కు ఫోన్ చేసి సమయాన్ని వృథా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ నంబర్లను అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి రిమాండ్



లింగంపేట(ఎల్లారెడ్డి): బైక్‌ల చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గాంధారి మండలం గుడిమెట్, మాధవపల్లి, తిమ్మాపూర్ ప్రాంతాల నుంచి బైక్‌లు ఎత్తుకెళ్లిన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కల్లూరుకు చెందిన బీర్కూరు లింగంను అరెస్ట్ చేశామన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా బాన్సువాడ నుంచి గాంధారివైపు అనుమానాస్పదంగా వస్తున్న లింగంను అదుపులోకి తీసుకొని విచారించగా.. తన బంధువైన కల్లూరుకు చెందిన సోలాపూర్ రాజుతో కలిసి బైక్‌లు చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నాడన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

టీషర్ట్ బుక్ చేస్తే పాత చున్నీ డెలివరీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన మీ సేవ నిర్వాహకుడు సునీల్ వారం రోజుల క్రితం అమెజాన్‌లో టీ షర్ట్, ప్యాంట్ బుక్ చేయగా పార్సిల్‌లో పాత చున్నీ వచ్చింది. సోమవారం రోజున వచ్చిన పార్సిల్‌ను తెరిచి చూసిన సునీల్ అవాక్కయ్యాడు. డెలివరీ బాయ్‌ని ఇదేమిటని ప్రశ్నిస్తే రిటర్న్ పెట్టాలని సూచించాడన్నారు. గతంలో కూడా పలుమార్లు ఒకటి ఆర్డర్ చేస్తే మరొకటి వచ్చిందని, ఆర్డర్ చేయకున్నా ఒకసారి తన పేరుపై పార్సిల్ వచ్చిందని సునీల్ వాపోయాడు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బాన్సువాడ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. ఈనెల 18న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గైనిశంకర్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారని, అలాగే 19వ తేదీన మధ్యాహ్నం బదావత్ దస్రూ అనే కానిస్టేబుల్ బస్‌డిపో మరో ట్రాక్టర్‌ను స్వాధీనంచేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

మనోవేదనకు గురై ఆత్మహత్య


ఆరేపల్లి లత(ఫైల్)

బాల్కొండ: అప్పులు ఎక్కువయ్యాయనే మనోవేదనతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెండోరా మండలం వెల్కటూర్‌లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన భూమేశ్వర్ ఉపాధి నిమిత్తం గత పదేళ్లుగా బహ్రెయిన్‌కు వెళ్తూ వస్తున్నాడు. ఆయన భార్య లత ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామంలోనే ఉంటోంది. ఇటీవల నూతన ఇంటిని నిర్మించుకోగా అప్పులు అయ్యాయి. ఇదే సమయంలో భర్తకు బహ్రెయిన్‌లో పని సరిగా లేకపోవడంతో అప్పులు తీర్చడం ఎలా అని లత మనోవేదనకు గురైంది. సోమవారం ఉదయం కొడుకును టీవీ చూస్తూ ఉండమని చెప్పి బెడ్ రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. తల్లి తలుపులు తీయకపోవడంతో ఆమె కుమారుడు పక్కింటి వారికి విషయం తెలిపాడు. వారు వచ్చి తలుపులు పగులగొట్టగా లత అప్పటికే చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కొత్తపల్లి బుచ్చన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త బహ్రెయిన్ నుంచి మంగళవారం రానున్నట్లు స్థానికులు తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

రుద్రూర్: తండ్రి హత్య కేసులో తనయుడికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిక్కడపల్లికి చెందిన నక్క సాయిలు అలియాస్ ఛత్రపతి 11 నవంబర్ 2023న రాత్రి రుద్రూర్ జవహర్‌నగర్ కాలనీలో ఉంటున్న తన తండ్రి నక్క చిన్నపోశెట్టి వద్దకు వచ్చి భూమి విషయమై తగాద పడి హత్య చేసి పారిపోయాడు. రెండు రోజుల తరువాత ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో సమీపంలో ఉన్న వారు పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు నక్క సాయిలు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. సాక్షుల విచారణ అనంతరం సాయిలుపై నేరం రుజువుకావడంతో నేరస్తుడికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి (బోధన్ సెషన్స్ కోర్టు జడ్జి) ఎస్ రవికుమార్ సోమవారం తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

అన్నను హత్య చేసిన తమ్ముడికి..

రెంజల్(బోధన్): అన్న హత్య కేసులో మండలంలోని నీలా గ్రామానికి చెందిన ఖలీం ఖురేషికి జీవిత ఖైదు విధిస్తూ బోధన్ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎస్ రవికుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. మద్యానికి బానిసైన మహ్మద్ ఖలీం ఖురేషి తరచు తల్లితో గొడవ పడుతుండడంతో ఆయన అన్నయ్య బాబా ఇరువురిని సముదాయించే ప్రయత్నం చేశాడు. 2019 జులై 14న తల్లితోపాటు సోదరుడితో మాట్లాడుతుండగా.. కోపోద్రిక్తుడైన ఖలీం ఖురేషి ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి బాబాపై దాడి చేశాడు. స్థానికులు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఖలీం ఖురేషిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం వాదనలు విన్న న్యామూర్తి నేరం రుజువుకావడంతో ఖలీం ఖురేషికి జీవిత ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

- రూ.15 లక్షల నగదు అపహరణ


వివరాలను సేకరిస్తున్న పట్టణ సీఐ వీరయ్య

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీ పెడగాపల్లి చౌరస్తాలో ఉన్న అన్నపూర్ణ సూపర్ మార్కెట్‌లో దుండగులు చోరీకి పాల్పడి రూ.15లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం సూపర్ మార్కెట్ తెరిచేందుకు వెళ్లిన యజమాని తాళాలు తెరిచి లోనికి వెళ్లగా కౌంటర్ తెరిచి ఉంది. దుండగులు పైకప్పు రేకులను కట్ చేసి లోనికిదిగి చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వీరయ్య విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాలనని, వరుసగా నాలుగైదు రోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో రూ.15లక్షల నగదును కౌంటర్‌లోనే ఉంచి వెళ్లానని సూపర్ మార్కెట్ యజమాని సుధీర్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.